14-03-2022 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - జ్ఞానం యొక్క మూడవ నేత్రంతో తండ్రిని చూడండి, తండ్రినే స్మృతి చేయండి, ఈ శరీరాన్ని చూస్తూ కూడా చూడకండి"

ప్రశ్న:- ఈ పాత ప్రపంచంలో ఉంటూ, పిల్లలైన మీకు ఏ డైరెక్షన్ లభించింది?

జవాబు:- మధురమైన పిల్లలూ - ఈ పాత ప్రపంచం, దేనిలోనైతే మీరు నివసిస్తున్నారో, ఇది శ్మశానంగా అవ్వనున్నది, దీనిపై రావణ రాజ్యముంది, దీని పట్ల మనసు పెట్టుకోకండి. ఇక్కడ ఉంటూ బుద్ధి యొక్క ఆసక్తి కొత్త ప్రపంచం వైపుకు వెళ్ళాలి. గృహస్థ వ్యవహారంలో ఉండండి కానీ కమల పుష్ప సమానంగా ఉండండి, అందరితోనూ సంబంధాలను యుక్తియుక్తంగా నిర్వర్తించండి. బుద్ధియోగం ఒక్క తండ్రితో జోడించబడి ఉండాలి. జ్ఞాన యోగాలలో పక్కాగా అవ్వండి. ఎటువంటి పరిస్థితిలోనూ సంతోషం యొక్క పాదరసం తగ్గకూడదు. ఓర్పు వహిస్తూ కర్మబంధనాలను తెంచుకుంటూ వెళ్ళండి.

గీతము:- ఓర్పు వహించు మానవా... (ధీరజ్ ధర్ మనువా...)

ఓంశాంతి. ఎప్పుడైతే మనుష్యులు దుఃఖితులుగా, వ్యాధిగ్రస్థులుగా ఉంటారో, అప్పుడు మనుష్యులు ఓర్పు వహించమని చెప్తారు. ఇక్కడైతే మీరు మనుష్యుల మతముపై నడవరు. మీరు ఈశ్వరీయ మతముపై నడుస్తున్నారు. అది కూడా అందరూ నడవరు. ఈశ్వరుడు, ఎవరినైతే సత్యమైన తండ్రి, సత్యమైన టీచరు, సద్గురువు అని అంటారో, వారి మతమైతే ప్రసిద్ధమైనది. మనుష్యుల నుండి దేవతలుగా అవ్వడానికి మరియు దైవీ ప్రపంచానికి యజమానులుగా అవ్వడానికి భగవంతుడే శ్రీమతాన్ని ఇచ్చారు. ఇంతటి ఉన్నతమైన మతమును ఇతరులెవ్వరూ ఇవ్వలేరు ఎందుకంటే మనుష్యమాత్రులందరూ పతితులుగా, భ్రష్టాచారులుగా ఉన్నారు. కనుక వారు మతాన్ని కూడా అటువంటిదే ఇస్తారు. మనకు శివబాబా మతము ఇస్తున్నారని పిల్లలైన మీకే తెలుసు. ఉన్నతోన్నతమైన తండ్రిది ఉన్నతోన్నతమైన మతము. వారినైతే భ్రష్టాచారి, పతితులు అని ఎవరూ అనరు. పతితులే ఆ నిరాకార తండ్రిని పిలుస్తారు - సాకారంలో ఉన్న వారి విషయం కాదు, అందుకే మనుష్యుల మతాన్ని వినకండి అని అంటారు. చెడు వినకండి, చెడు చూడకండి... ఈ నేత్రాలు మనుష్యులనైతే చూస్తాయి కానీ మీకు మూడవ నేత్రం లభించింది, దానితో వారిని చూడాలి మరియు ఆ తండ్రినే స్మృతి చేయాలి. తండ్రిని చూడగలిగేలా మూడవ నేత్రం ఉన్నవారు ఇతరులెవ్వరూ లేరు. ఒకవేళ మీరు తండ్రిని చూడడానికి వెళ్ళారనుకోండి, వీరైతే ఆత్మ కదా అని బుద్ధిలో ఉంటుంది. మీరు ఆత్మనే చూస్తారు. జీవాత్మ అని అనాలి. కేవలం సోదరి అని అనడంతో ఆత్మను మర్చిపోతారు. మీరు ఈ శరీరాన్ని మర్చిపోండి అని ఇక్కడ అర్థం చేయించడం జరుగుతుంది. స్వయాన్ని ఆత్మగా భావించండి మరియు తండ్రిని స్మృతి చేయండి. వారిని దివ్య నేత్రంతో చూడండి. మీ ఆత్మకు ఇప్పుడు ప్రకాశం లభించింది - మన తండ్రి ఎవరు! ఎక్కడ ఉంటారు! వారి నుండి మనకు ఏం లభించనున్నది! తండ్రి నుండి వారసత్వం తీసుకునే పురుషార్థం చేసే మీ వంటివారు ప్రపంచంలో ఎవ్వరూ లేరు. ఎప్పటివరకైతే ఎవరైనా బిడ్డగానే అవ్వరో, అప్పటివరకు తండ్రి నుండి వారసత్వాన్ని ఎలా తీసుకోగలరు. తండ్రి యొక్క వారసత్వము అపారమైనది. ఉన్నతోన్నతమైనది సూర్యవంశీ రాజా-రాణిగా అవ్వడము. బ్యారిస్టరీ అయితే పాస్ అవుతారు కానీ అందులో కూడా నంబరువారుగా ఉంటారు. కొందరైతే చాలా సంపాదిస్తారు, కొందరికైతే కడుపు కూడా కష్టం మీద నిండుతుంది. మనం ఈశ్వరుడి నుండి రాజ్యాన్ని ప్రాప్తి చేసుకుంటున్నామని ఇప్పుడు మీకు తెలుసు. వీరు సత్యమైన తండ్రి, సత్యమైన టీచరు, సద్గురువు అని ఏ మనిషినీ కూడా, ఎప్పుడూ ఎవరూ అనలేరు. మిగిలినవారందరూ గురువులు. సద్గురువు, సత్యాన్ని చెప్పేవారు ఒక్కరే. మిగిలినవారందరూ అసత్యాన్ని చెప్పేవారు. వారు సత్యమైన సద్గతిని ఎవరికీ ఇవ్వలేరు. సద్గురువు యొక్క మహిమ మాకు, మీకు కూడా ఇంతకుముందు తెలియదు. వారు సత్యమైన తండ్రి, సత్యమైన టీచరు, సద్గురువు ఎలా అవుతారు అన్నది ఎవ్వరి బుద్ధిలోకి రాదు. వారైతే సర్వవ్యాపి అని అంటూ విషయాన్ని సమాప్తం చేసేస్తారు. వారు తండ్రి, మనం పిల్లలము అని పరమాత్మను వేరుగా భావించరు. అందరూ తండ్రులే తండ్రులు అని అనేస్తారు. అంతకన్నా కిందకు రాయి, రప్పలలో పరమాత్మను తోసేసారు. అలా కాదు అని తండ్రి అర్థం చేయిస్తారు. తప్పకుండా తండ్రి సత్యమైన తండ్రి, సత్యమైన టీచరు, సద్గురువు ఒక్కరేనని ఇప్పుడు పిల్లలైన మీకు నిశ్చయం కలిగింది. వారి గురించి ఎవరికీ తెలియదు. ఒకవేళ తెలిసి ఉంటే అక్కడికి వెళ్ళగలగాలి. ఎవరి గురించైనా తెలుసుకున్నట్లయితే, వారి నామ, రూప, దేశ, కాలాలు అన్నింటినీ తెలుసుకోగలుగుతారు. లేదంటే తెలుసుకోవడం వలన లాభమేమిటి! మనుష్యులందరూ దుఃఖితులుగా ఉన్నారు, అందుకే శాంతిని కోరుకుంటారు.

మనం వాస్తవానికి శాంతిధామ నివాసులమని, అక్కడి నుండి మనం వస్తామని వారికి తెలియనే తెలియదు. ఆత్మలైన మన స్వధర్మం శాంతి. బాబా గురువుల గురించి అర్థం చేయిస్తారు, వారు ఎవరికీ సద్గతినివ్వలేరు. వారు భయపెడతారు, గురువుకు నింద తీసుకొచ్చేవారు ఉన్నత స్థానాన్ని పొందలేరు అని అంటారు. వాస్తవానికి ఈ మాటలన్నీ అనంతమైన తండ్రి కోసము, ఒకవేళ మీరు నాకు నింద తీసుకొచ్చినట్లయితే సత్యయుగంలో ఉన్నత స్థానాన్ని పొందరు. మీరు నన్ను నిందించినట్లయితే స్థానాన్ని పొందరని సన్యాసులైతే ఈ మాటను అనలేరు. ఏ స్థానము? ఆ స్థానం గురించైతే ఏమీ తెలియనే తెలియదు. సాధన చేస్తూ ఉంటారు కానీ సాధన చేయడంతో సద్గతిని పొందలేరు. ఇలా తండ్రే వచ్చి ఓదార్పునిస్తారు. తప్పకుండా 84 జన్మల చక్రం తిరిగాము, మనం చాలా దుఃఖితులుగా ఉన్నామని మీకు తెలుసు. ఎప్పటివరకైతే సుఖధామం యొక్క సాక్షాత్కారం కలగదో, అప్పటివరకు ఇది దుఃఖధామమని ఎలా అర్థమవుతుంది! ఇది దుఃఖధామమని, అల్పకాలిక సుఖం ఉంటుందని ఇప్పుడు మీకు తెలుసు. ఈ అల్పకాలిక రాజ్యంలో ఎంత సంతోషం ఉంటుంది. గాంధీ, రామ రాజ్యాన్ని స్థాపన చేసారని భావిస్తారు. కానీ అలా కాదు, ఇది ఇంకా తీవ్రమైన రావణ రాజ్యంగా అయిపోయింది. పతితంగా, భ్రష్టాచారిగా ఉన్నారని అందరూ అంటారు. ఇంతకుముందు కేవలం పతితంగా ఉండేవారు, ఇప్పుడైతే భ్రష్టాచారి అని కూడా అంటారు. ఇది కలియుగాంతము. ఎంతగా లంచగొండితనం ఉంది. ఇప్పుడు ఓర్పు వహించండి అని తండ్రి వచ్చి మొత్తం ప్రపంచం యొక్క మనుష్యమాత్రులందరికీ చెప్తారు. కానీ వినరు. చివర్లో అందరికీ తెలుస్తుంది. ప్రదర్శనీలో కూడా, దుఃఖపు ప్రపంచాన్ని తొలగించి, సుఖమయ ప్రపంచాన్ని ఎలా తయారుచేస్తున్నారు అన్నదే చూపిస్తారు. ఆఖరుకు అందరూ వినడమైతే వింటారు కదా. ఒకవైపు మాయ అందరి గొంతులు ఎండిపోయేలా చేస్తూ ఉంటుంది. ఇంకొకవైపు తండ్రి తమ పరిచయాన్ని ఇస్తూ ఉంటారు. ఇప్పుడైతే చాలామంది మనుష్యులకు శబ్దాన్ని చేర్చాలి. ఎంతెంతగా మహిమ వెలువడుతూ ఉంటుందో, అంతగా వార్తాపత్రికల్లో కూడా ఎక్కువగా ముద్రించబడుతుంది. అప్పుడు చాలా మంది వస్తారు. ఇది శ్రమ. ధర్మము లేక మతము మొదలైనవి స్థాపన చేయడమైతే చాలా సహజము. బౌద్ధ ధర్మానికి సంబంధించిన వారొకరు, ఒక భాషణ చేసారు, 60-70 వేల మందిని బౌద్ధులుగా తయారుచేసారు. ఇక్కడైతే శ్రమ ఉంది. మాయ చాలా తీవ్రంగా ఎదుర్కొంటుంది. అక్కడైతే మాయతో యుద్ధం యొక్క విషయమే లేదు. ఇక్కడ మాయతో యుద్ధం చేయడంలో శ్రమ ఉంది. ముఖ్యమైన విషయము పవిత్రతకు సంబంధించినది. ఇంకే స్థానంలోనూ పవిత్రత యొక్క విషయం లేదు. వారికైతే ఇంటి పట్ల వైరాగ్యం కలుగుతుంది లేదా ఏదైనా దొంగతనం, పాపం మొదలైనవి చేస్తారు, అప్పుడు సన్యాసాన్ని ధారణ చేస్తారు, అందుకే దొంగలను పట్టుకునేందుకు కూడా గవర్నమెంటుకు సన్యాసి సి.ఐ.డి.లు మొదలైనవారిని పెట్టాల్సి వస్తుంది. మధ్యవర్తుల రూపంలో, వ్యాపారస్థుల రూపంలో కూడా సి.ఐ.డి.లు ఉంటారు. పోలీసులవి గుప్త కార్యాలు చాలా నడుస్తూ ఉంటాయి. స్నేహం వంకతో కూడా బంగారు వ్యాపారస్థులతో కలిసిపోతారు, తర్వాత అంతా తెలిసిపోతుంది. వ్యాపారస్థులు, వ్యాపారం కూడా చేస్తారు, సి.ఐ.డి.గా కూడా చేస్తారు. ప్రపంచం చాలా కష్టాల్లో చిక్కుకొని ఉంది. మీరు చాలా భాగ్యశాలి, ఈ కష్టాలన్నింటి నుండి దూరంగా బయటకు వచ్చేసారు. ప్రపంచంలోనైతే కష్టాల మీద కష్టాలు ఉన్నాయి. మీ కోసం చాలా ప్రాప్తి ఉంది. వారైతే దుఃఖితులై మరణిస్తారు. పాత శరీరం సమాప్తమైపోతే మేము తిరిగి బాబా వద్దకు వెళ్ళిపోతామని మీరు ఈ శరీరాన్ని విడిచిపెట్టేందుకు కూర్చున్నారు. తండ్రితో మరియు కొత్త ప్రపంచంతో మనసు జోడించబడింది కనుక ఇక పాత ప్రపంచం దేనికి పనికొస్తుంది. ఇదైతే పాత వస్త్రము. దీని పట్ల వైరాగ్యం కలుగుతుంది. సన్యాసులకు ఇళ్ళు-వాకిళ్ళ పట్ల వైరాగ్యం కలుగుతుంది. స్త్రీని నాగినిగా భావిస్తారు. మీదైతే సత్యాతి-సత్యమైన వైరాగ్యము. జ్ఞానము, భక్తి మరియు వైరాగ్యము అని అంటూ ఉంటారు కూడా. పాత ప్రపంచం పట్ల వైరాగ్యం పొందండి అని జ్ఞానం లభిస్తుంది. ఇది శ్మశానముగా అవ్వనున్నది. అది హద్దు సన్యాసము, ఈ పాత ప్రపంచం సమాప్తం కానున్నదని వారికి తెలియదు. మేము ఇంట్లో కలిసి ఉండలేము అని వారంటారు కనుక వారికి ఇంటి పట్ల వైరాగ్యం కలుగుతుంది మరియు వారు అడవుల్లోకి వెళ్ళిపోతారు. మీది అనంతమైన వైరాగ్యము కానీ దీని గురించి ఎవరికీ తెలియనే తెలియదు. మీరంటారు, మాకైతే మొత్తం పాత ప్రపంచంతో, శ్మశానంతో వైరాగ్యం ఉంది. ఇది రావణ రాజ్యము. పాత ప్రపంచం పట్ల మనసు పెట్టుకునే మూర్ఖులు ఎవరు ఉంటారు. ఏర్పాట్లు అన్నీ జరిగి, సత్యయుగ సమయం వచ్చినప్పుడు యుద్ధం మొదలవుతుంది. చాలా మంది రాస్తారు, ఇంట్లోనే కూర్చొని ఉన్నాము కానీ ఏం చేయాలి, ఒకవేళ మమకారం పెట్టుకోకపోతే సంభాళన ఎలా జరుగుతుంది అని తికమకపడతారు. తండ్రి అంటారు, పిల్లలూ, ఉండడమైతే ఇక్కడే ఉండాలి. కానీ బుద్ధి యొక్క ఆసక్తి ఇప్పుడు కొత్త ప్రపంచం వైపు వెళ్ళాలి. సత్యమైన ప్రేమ దాని వైపు వెళ్ళాలి. ఈ పాత ప్రపంచంతో వైరాగ్యము ఉంది. దేహంతో కూడా వైరాగ్యము. ఇంకేం మిగిలి ఉంది. చాలా మంది అడుగుతారు - బాబా, ఇరువైపులా సంబంధాన్ని నిర్వర్తించాలని మీరు అంటారు. అదైతే తప్పకుండా చేయాలి. ఒకవేళ సంబంధాన్ని నిర్వర్తించకపోతే సన్యాసుల వలె అయిపోతారు. గృహస్థ వ్యవహారంలో ఉంటూ పవిత్రంగా ఉండండి. దేహీ-అభిమానులుగా అయ్యే పురుషార్థం

చేసినట్లయితే బుద్ధియోగం తండ్రితో జోడించబడుతుంది. నేను ఆత్మను, తండ్రి వద్దకు వెళ్ళాలి. తండ్రి అంటారు, గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమల పుష్ప సమానంగా అవ్వండి. జ్ఞానం మరియు యోగం లేవు అంటే వేలాడుతూ ఉంటారు. ప్రతి ఒక్కరి జన్మపత్రి వేర్వేరుగా ఉంటుంది. ప్రతి ఒక్కరి కోసం యుక్తి కూడా వేర్వేరుగా లభిస్తుంది. ఏదైనా కష్టముంటే అడగండి. ఎటువంటి పరిస్థితిలోనైనా సంతోషపు పాదరసం పైకి ఎక్కాలి. మనం ఇంటికి వెళ్తాము, తర్వాత కొత్త రాజధానిలోకి వస్తాము. ఇంకా కొద్ది సమయమే మిగిలి ఉంది. పాత్రను అభినయించాలి. మమకారాన్ని తెంచుకుంటూ వెళ్ళాలి. ప్రతి ఒక్కరి కర్మ బంధనము వేర్వేరుగా ఉంటుంది. కొందరిది తేలికపాటిగా, కొందరిది భారీగా ఉంటుంది. బాబా నుండి యుక్తి తీసుకొని ఓర్పుతో కర్మబంధనాలను తెంచుకుంటూ వెళ్ళాలి, ఇందులో గుప్త శ్రమ కావాలి. బుద్ధిని యాత్రకు తీసుకువెళ్ళడంలో శ్రమ ఉంది. ఘడియ-ఘడియ బుద్ధియోగం తెగిపోతుంది. ఇప్పుడు పరిపక్వంగా అయినట్లయితే కర్మాతీత అవస్థ వచ్చేస్తుంది. ఇప్పుడైతే అనేక రకాల వికల్పాల తుఫానులే వస్తూ ఉంటాయి. ఒక్కసారిగా నిద్రే ఎగిరిపోతుంది. వికల్పాలనే తుఫాను అని అంటారు, ఇతర సత్సంగాలలో ఈ విషయాలు ఉండవు. అక్కడైతే చెవులకు ఇంపుగా ఉంటుంది, లాభమేమీ ఉండదు. ఇక్కడైతే ఇది సంపాదన కోసం చదువు. చదువును చెవులకు ఇంపైనది అని అనరు. కనుక తండ్రి అర్థం చేయిస్తారు, ఇది అంతిమ జన్మ, పాత ప్రపంచం సమాప్తమవ్వనున్నది. మరి శ్రీమతంపై నడుచుకుని ఉన్నత పదవిని ఎందుకు పొందకూడదు! ఎప్పటివరకైతే ఇందులో తెలివైనవారిగా అవ్వరో, అప్పటివరకు శరీర నిర్వహణ కోసం కర్మలనైతే చేయాలి, తర్వాత మనం ఈ ఈశ్వరీయ సేవలో నిమగ్నమైపోవాలి. మొత్తం ప్రపంచాన్ని రక్షించాలి. మీరు ముక్తిదళము. నరకం నుండి బయటకు తీసి స్వర్గంలోకి తీసుకువెళ్తారు. విశ్వమనే నావ మునిగిపోయి ఉందని ఆ ముక్తి దళానికి తెలియదు. అందరూ రావణుని సంకెళ్ళలో చిక్కుకొని ఉన్నారు. మొత్తం విశ్వాన్ని ఇప్పుడు రక్షించాలి, ఇందులోనైతే తండ్రి సహాయం కావాలి. మీరు ఆత్మిక ఈశ్వరీయ ముక్తిదళము. మనుష్యమాత్రులను రావణుడి పంజా నుండి విడిపించాలి. ఇంతటి నషా కావాలి. ఆ దైహిక సమాజ సేవకులైతే చాలా మంది ఉన్నారు. మీరు ఎంత కొద్దిమంది ఉన్నారు. ఇక్కడైతే మనుష్యులు కూడా చాలా మంది ఉన్నారు, సత్యయుగంలో మనుష్యులు చాలా కొద్ది మందే ఉంటారు. కొద్దిమంది పిల్లలైన మీరు మాత్రమే ఆత్మిక తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటారు. ఈ అంతిమ జన్మ ఏదైతే గవ్వలా ఉందో, అది వజ్రతుల్యంగా అవ్వాలి. ఒక్క ఆది సనాతన దేవీ దేవతా ధర్మ స్థాపన, అనేక ధర్మాల వినాశనము. తండ్రియే ఏక ధర్మాన్ని స్థాపన చేస్తారు మరియు చేయిస్తారు. అంటు కట్టడంలో అనగా స్థాపన చేయడంలో చాలా శ్రమ అనిపిస్తుంది. ఎప్పటివరకైతే ఎవరినీ తండ్రి సమానంగా తయారుచేయరో, అప్పటివరకు సంతోషపు పాదరసం ఎక్కదు. ఎప్పుడైతే దానం చేస్తారో, అప్పుడే సంతోషపు పాదరసం ఎక్కుతుంది. ఎవరి వద్దనైతే ధనం ఉంటుందో, కానీ దానం చేయరో, వారిని పిసినారులు అని అంటారు. ఇక్కడ మళ్ళీ అలా ఉండదు. ఎవరి వద్ద ఉంటుందో, వారైతే ఇస్తూనే ఉంటారు. లేదంటే వీరి వద్ద ధనమే లేదని భావిస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈశ్వరీయ ముక్తిదళముగా అయి మునిగిపోయి ఉన్న విశ్వం యొక్క నావను తీరానికి చేర్చాలి. మనుష్యులను గవ్వ నుండి వజ్రతుల్యంగా తయారుచేయాలి. జ్ఞాన ధనాన్ని దానం చేయడంలో పిసినారులుగా అవ్వకూడదు.

2. తమ మనసును తండ్రి మరియు కొత్త ప్రపంచంతో జోడించాలి. ఈ పాత దేహం పట్ల అనంతమైన వైరాగిగా అవ్వాలి.

వరదానము:- దివ్య బుద్ధి ద్వారా సదా దివ్యతను గ్రహించే సఫలతా మూర్త భవ

బాప్ దాదా ద్వారా ప్రతి బిడ్డకు జన్మతోనే దివ్య బుద్ధి యొక్క వరదానం ప్రాప్తిస్తుంది, ఈ దివ్య బుద్ధి యొక్క వరదానాన్ని ఎవరు ఎంతగా కార్యంలో ఉపయోగిస్తారో, అంతగా సఫలతామూర్తులుగా అవుతారు ఎందుకంటే ప్రతి కార్యంలో దివ్యతనే సఫలతకు ఆధారము. దివ్య బుద్ధిని ప్రాప్తించుకునే ఆత్మలు అదివ్యతను కూడా దివ్యంగా చేసేస్తారు. వారు ప్రతి విషయంలో దివ్యతనే గ్రహిస్తారు. అదివ్యమైన కార్యం యొక్క ప్రభావం దివ్య బుద్ధి కలవారిపై పడజాలదు.

స్లోగన్:- స్వయాన్ని అతిథిగా భావిస్తూ ఉన్నట్లయితే స్థితి అవ్యక్తంగా మరియు మహాన్ గా అయిపోతుంది.